# మత్కుణాఖ్య రామాయణం

## పణతుల రామచంద్రయ్య

"శివు డద్రిని శయనించుట
రవిచంద్రులు మింట నుంట, రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
బవళించుట నల్లిబాధ పడలేక సుమీ!"

మహామహా కొమ్ములుతిరిగిన శివుడూ, సూర్య చంద్రులూ, నారాయణుడూ అంతటివాళ్ళే నల్లిబాధ పడలేక ఒకరు కొండమీదా, ఇద్దరు ఆకాశంలో, మిగతా ఒక్కరూ శేష శయ్య మీదా వరుసగా నెలవు ఏర్పరచుకున్నారట!

నిజం. మానవుడి ఆరోగ్యానికి ఉపద్రవ మయిన ప్రముఖజీవుల కోవకు నల్లులు కూడా చేరతాయి. శరదృతువులో వృక్షజాలమంతా పచ్చగా కలకలలాడుతూ వుంటే, ఆ 'కల కల' లకు సమప్రమాణంలో దోమలు ప్రభ వించి రాత్రిళ్లు నిద్రపోనీకుండా నానా యాతనా పెడతాయి. అలాగే, సన్నజిల్లేడు దూదితో కాశీపట్టుతో మెత్తగా పరుపులూ దిండ్లూ కుట్టించి, వాటి కొనుకుని ఓ నిము షంసేపు తన్మయత్వం పొందుదామను కుంటే, ఆ మెత్తకు తగినట్టుగా ఆపరుపుల్లో నల్లులు కాపురంచేస్తో, వాటి కొనుకున్న మానవుల రక్తాన్ని గ్రోలుతూ అవి తన్మ యత్వం పొందుతాయి. ఈ నక్కచావు పడలేకనే కాబోలు—విష్ణు మహేశ్వర సూర్య చంద్రులు తమతమ పరుపుల్ని వదిలిపెట్టి తలా ఒకచోటికి చేరుకున్నారు!

ఇలా యీ నలుగురూ—అంటే ఉమాకాంతుడూ, ఉషాకాంతుడూ, తారాకాంతుడూ, రమాకాంతుడూ—తలా ఒక నెలవు చూసుకోవ డంలో మరో విశేషంకూడా కలిసివచ్చింది. వెండికొండ అంతా నిరంతర హిమాకరం కావటంవల్లనూ, వినువీధిలో ప్రాణులు మనడానికి సరైన వాతావరణం మృగ్యమై నందువల్లనూ (అక్కడ ఆక్సిజన్ లేదుగా మరి!), శేషశయ్య చుట్టూవున్న సముద్ర తరంగాలు విపరీతంగా ఉప్పుఘాటు వెలా ర్చటం వల్లనూ, ఆయా ప్రదేశాలలో నల్లులే కాకుండా దోమలుకూడా చేరవు. ఈ విధంగా "అద్రినిశయనించుట, మింటనుంట, అవిరళముగ శేషునిపై బవళించుట"లో వీళ్ల ఖుద్రలు అమోఘంగా పనిచేశాయనే చెప్పాలి.

అయితే ఇక్కడివరకూ వొచ్చాక కొంచెం ధర్మసందేహం కలక్కమానదు. ఇంతాచేసింది కమలభవుడు. ఈయనా త్రిమూర్తుల బోగులో మెంబరే. (ఈయన మట్టుకు ఈయనకూడా నల్లిబాధ పడలేక తిరులతాగులామ్మకులచే ఆవృతమైన పాల రాతిమీద కూర్చున్నాడనుకోండి) ఈయన గారు దూరాలోచనలేకుండా నల్లులను పుట్టించి, వాటికి రక్తం ఆహారంగాచేస్తే, తోటిసభ్యులిద్దరూ ఆ విధంగా చోరాక చోటికి వెళ్ళిపోవలసిన అగత్యమెందుకు కలి గింది? అందులోనూ బ్రహ్మ నారాయణుడి పుత్రుడేనాయె! అలాంటప్పుడు—శివుడూ విష్ణువూ ఒకటై బ్రహ్మను అదిలించి "ఇలా చేసేవేమిటోయ్?...సరిచెయ్యి." అనేస్తే, బ్రహ్మ తన కృతాన్ని మార్చేసి వుండును కదా! ఈ విషయంలో వీళ్లి బుద్రలు మంద గించినయ్యేం?—మాస్తే, మత్కుణ పటు ప్రతాపధాటికి భయపడి పరిగెత్తేటప్పుడు వీళ్లకు ఆ మాత్రం ఆలోచించుకునే పాటి స్తిమితమైనా చిక్కలేదేమో అనిపిస్తుంది. పైగా సమయా నికి ఏ పరాకున వున్నాడో ఆ మహాత్ముడు చతుర్ముఖుడు ఈ నలులకు మృదు హంస తూలికా తల్పాలలో ఉండేట్టు వరంకూడా రాసిపడేసి కూచున్నాడు!

నెత్తురుపీల్చి బాధించడంతోటే ఊరుకోవు

55-వ పేజీ చూడండి)



ప్రతి ఆదివారం రాత్రి 6-30 గం॥ 41 మీటర్లమీద రేడియో సిలోన్‌లో దక్షిణ భారతభాష లన్నింటిలో వెలువడే ప్రోత్సాహక కళాకారుల ప్రోగ్రామ్,
అమృతాంజలి వినండి.

# మత్కుణాభి రామాయణం

(5-వ పేజీ తరువాయి)

నల్లులు. మా మామయ్య ఎప్పుడైనా మా యింటికి వచ్చినప్పుడు ఖర్మకొద్దీ ఏ నల్లి అయినా కంటపడితే చాలు, "నేయి బోయగగ్గున దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి", దాన్ని ఏ ఆయుధంతోనైనా చంపే వరకూ నిద్రపోడు. ఈయనకు నల్లులంటే ఇంత కసి ఏమిటా అని వాకబుచేస్తే, అధికార రీత్యా తెలియవచ్చిం దిది :

ఓ రోజున మామయ్య వాళ్ల ఆఫీసరుకు లీవు లెటరు రాస్తూ, అందులో—తన మామగారికి తీవ్రంగా టైఫాయిడ్ కాస్తోందని, వెళ్ళి చూసి రావటానికి ఓ వారంరోజులు సెలవు గ్రాంటు చేయమనీ కోరాడట. అలా రాసుకున్నవాడు దాన్ని ముందు పంపించెయ్యక అట్టే పెట్టి, పుట్టింట్లో ఉన్న భార్యకు జాబు రాయనారంభించాడట. అందులో తను ఆఫీసరుకు మస్కా కొట్టి, అబద్ధాలాడి వారంరోజులు సెలవు ఇప్పించుకుంటున్నాననీ, ఆ రోజు గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్సుకే వూరికి బయలుదేరుతున్నాననీ ఆమెకు విశదీకరించాడట. ఇలా జాబు పూర్తయిందో లేదో—సరిగ్గా ఆ క్షణంలోనే—వయ్యారంగా దిండుమీద కూచుని ఆవులిస్తున్న ఆయనను, అంతదాకా వేచివున్న నల్లి ఒకటి తొడమీద ముద్దెట్టుకున్నదట. ఆ దెబ్బతో, ఆకాశవీధులలో విహరిస్తున్న మామయ్య ఒక్కసారిగా ఈ లోకంలోపడి, దిగ్భ్రాంతి పడినవాడై, ఆ భ్రాంతిలో భార్యకు రాసిన లేఖ ఆఫీసరుకూ, లీవు లెటరు భార్యకూ పోస్టు చేసేశాడట!—ఇక తరువాత జరిగినదేమిటి?—సమాధానానికి వెండితెరపై చూడవలసిందే! ఇక్కడేమో ఆఫీసరు దుర్వాసుడై ధుమధుమలాడిపోయి ఆశీర్వచనాలు కురిపించేశాడు. అక్కడినుంచీ భార్య జాబురాసింది "మా నాన్నకు టైఫాయిడ్ రావాలని మీకు కోరికగా వుందా?" అని! ఇక మామయ్య అవస్థ ఏం చెప్పను? ... అందుకే ఈనాటికీ ఎక్కడయినా నల్లి కనిపిస్తే చాలు, ఆయనకు ఆనాటి విషాద సంఘటనలన్నీ కళ్లకు కట్టినట్టయి, ఒళ్లు జలదరిస్తుందట!

నల్లులవల్ల ఇలాంటివే చాల అవస్థలున్నాయి. చాలాచోట్ల పెళ్లిచూపుల కార్యక్రమం సాగేటప్పుడు, వాళ్ళకై ఏర్పాటుచేసిన ఆ అద్దె కుషన్‌లలో ఏ కొన్ని నల్లులైనా చేరివుండి ఆ 'వుడ్ బీ' అల్లుడినీ, ఆయన పరివారాన్నీ కాస్త పరామర్శిస్తే, వాళ్లు కంగారెత్తి—"బాబో, ఈ మామగారు వరక్రయంతోబాటు నల్లుల్ని కూడా ప్రసాదిస్తాడు కాబోలు" అనుకుని, ఆ కోపంతో తిరిగిపోవటం లాంటివి జరుగుతూ ఉంటాయి. జరిగినప్పుడు మనం ఏ మాత్రం ఆశ్చర్యపడవలసిన అవసరంలేదుకూడా ... కొందరికి పైత్యప్రకృతి కావటంవల్ల, నల్లి కరిస్తే ఒళ్లంతా పెద్ద పెద్ద దద్దుర్లు పేలి మహాబాధ వేస్తుంది. 'కించిత్తు నల్లి గరచిన మంచమునకు దెబ్బవచ్చు' అన్నాడు సుమతీ శతకకారుడు.

అయితే యింత ఉపద్రవమయిన నల్లులవల్ల కూడా కొంచెం ప్రయోజనము లేకపోలేదు. ముఖ్యంగా సినిమాహాలువాళ్ళకు నల్లులు చేసే ఉపకారం ఇంతింతా కాదు. చాలా థియేటర్లలో యజమానులు అర్ధరూపాయిసీట్లలో నల్లుల్ని భారీప్రమాణంలో ఉంచుతారు. ఇందువల్ల వాటి బాధపడలేక (మానవమాత్రులు గనుక) ఆ సీట్లకు వచ్చే ఆసాములంతా ముప్పాతికమంది పద్నాలుగణాల టిక్కెట్టు కొనుక్కుంటారు. కాని దూరదృష్టిగల యజమానులు ఆ సీట్లలోనూ




## మత్కుణ బాధ రామాయణం

కొద్దిగా మత్కుణయూధాన్ని ప్రవేశపెట్టి ఉంచటంవల్ల, చాలామంది, ఈ ఏడుపంతా ఎందుకులెమ్మని రిజర్వుడుకు పోతుంటారు. అందుకే ఇప్పుడు చాలా హాళ్లలో రూపాయున్నర టిక్కెట్లే ఎక్కువ పోతున్నాయి!

ఇంతెందుకూ? మొన్న మొన్న మా శేషుబావ నూక్కాలుపైనలునుంచి బయటపడేది మత్కుణ సహాయంవల్లనేనని గుండెమీద చెయ్యివేసుకు చెప్పగలను. సెలవుల్లో రాత్రి పదివరకూ రాని నిద్ర, మాసపత్రికలు పట్టుకుంటే పదకొండువరకూ రాని నిద్ర, పరీక్షల్లో రాత్రి ఏడింటికి క్లాసు బుక్కు స్పృశిస్తే చాలు, ముంచుకొచ్చేది వాడికి. మా పక్కింటి ఆచార్లుగారింట్లో నల్లులున్నాయి చూడండీ—అవి నల్లులా అని అనుమానం వేస్తుంది; ఒక్కొక్కటి అర్ధణా అంతవి వున్నాయి. మా శేషుబావ, ఇక ఇది పనిగాదని, ఒక్కసారి వాడి పరుపు తీసుకెళ్లి ఆచారుగారింట్లో పడకచుట్టలమీద రెండు నిమిషాలపాటు ఉంచి తెచ్చుకున్నాడు. ఆనాటినుంచి రాత్రిళ్ళు పుస్తకం పట్టుకున్నప్పుడు నిద్ర వస్తే వెళ్ళి ఒక అరనిముషం ఆ పరుపుమీద పడుకునేవాడు. పడుకున్న మరుక్షణంలోనే నవ చైతన్యం పొంది, ఆ దెబ్బతో ఇవతలికి వచ్చి చదువు మొదలెట్టేవాడు. మళ్ళీ నిద్ర వస్తే మళ్ళీ......

ఇంకా, పంచతంత్రాల్లో ఒకటైన 'విగ్రహానికి' కూడా నల్లులు పనికివస్తాయి. మొన్న ఒకసారి మా పొరుగింటి దుర్గమ్మబామ్మగారు మా తాతయ్యను రెండు సొటకూర కొనమంటే, ఆయన లేవు పొమ్మన్నాడట. ఆమె అందుకే కోపపడి "పామైన మరచిపోవును, భామిని మరువంగబోదు పగ సెన్నటికిన్" అని జ్ఞాపకంచేసేందుకు—వాళ్ళింట్లో అసంఖ్యాకంగా వున్నవాటిల్లో ఓ పది నల్లుల్ని పట్టుకొచ్చి మా యింట్లో వదిలిపెట్టింది. ఇంతా జరిగి వారం రోజులైనా కాలేదు; అవి బహుముఖంగా సంతానాభివృద్ధి చేసుకుని ఎక్కడా కూచోనివ్వకుండా అవస్థపెడుతున్నాయి. ఇంకా రాద్దామని వుంది కాని, అవి కుర్చీలో కూడా చేరుకుని కరిచి పారేస్తూ వ్రాయనివ్వటం లేదు. మరేం చెయ్యను? ★

## న్యూఢిల్లీ లేఖ

(10వ పేజీ తరువాయి)

విషిణీకనిపించవు. చాపలుమాత్రమే. కనిపిస్తాయి. వాటిమీద పిల్లలు. పిల్లలవంటినిండా దద్దుర్లు. అక్కడక్కడ ఓ మేక. ఇంత దారుణం ఇక ఏనగరంలోను కనబడదనుకుంటాను. 70 లక్షలమంది పోర్చుగీసుప్రజల్లో బహుశా 70 వేలమందికి మాత్రమే కడుపునిండా తినడానికి ఉన్నది."

పైతరగతుల ప్రజలను రచయిత్రి ఇలా వర్ణించింది:

"వీరంతా నల్లటిసూట్లు ధరిస్తారు. బాగా గంజిపెట్టిన కాలర్లు, బౌటైలుధరిస్తారు. పట్టిపట్టి మర్యాదగా మాట్లాడతారు. కాని ఉండుండి వారిముఖాలపై ఏదోగాఢమైన విద్వేషం రేఖామాత్రంగా కనిపిస్తుంది. వీరిలో కొందరు మాజీమంత్రులు. కొందరు మాజీ జర్నలిస్టులు. కొందరు మాజీప్రొఫెసర్లు. కొత్తప్రభుత్వం అడుగులకు మడుగులొత్తక పోవడంవల్ల వీరందరూ అణగారిపోయారు. అంతా బీదవారే. చెరలో బంధితుల్లాగ కనిపిస్తారు. ఇంకా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నవారెవరైనా ఉంటే, వారికికూడా లోలోపల ఏదోరాబోతోందనే భయం పీకుతూనే ఉంటుంది. డబ్బుతీసుకోకుండా బీదవారికి వైద్యంచేసే డాక్టరు, ఒక చిన్న ఆస్పత్రిని స్థాపించడానికి ప్రయత్నించిన డాక్టరు, కనీసం ఉన్నఆస్పత్రులను శుభ్రంగాఉంచాలనుకున్న డాక్టరు వెంటనే అనుమానాస్పదుడుగా జమఅవుతాడు. సాయంకాలాలప్పుడు విద్యాబోధన చేయదలచినవాడుగాని, దానధర్మాలు చేయదలచినవాడుగాని ఉంటే చర్చి, ప్రభుత్వమూకూడా వెంటనే అతన్ని శత్రువుగా జమకట్టడం జరుగుతుంది. అయినా అలాంటి ఉదార స్వభావులు ఇంకా ఉన్నారు. నాజీలశకం అంతరించగానే తమదేశంలోని ఫాసిజం కూడా నశిస్తుందని వీరంతా ఆశలతో బ్రతికారు. సాలాజార్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని వీరు కలలుకన్నారు. కాని తాము ఏకాకులమని వారికి ఇప్పుడు తెలిసింది. పోర్చుగల్‌లో బ్రిటిష్ పెట్టుబడిదారులకు వ్యాపారాలున్నాయనీ, అజోర్స్‌లో విమానస్థావరాలకోసం అమెరికన్లు పోర్చుగీసు ప్రభుత్వంతో మంతనాలు జరుపుతున్నారని వారు గుర్తించారు."

'స్వేచ్ఛ, వ్యక్తిస్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!' ఎంతచక్కని నినాదం! ★

## [illegible]

(11-వ పేజీ తరువాయి)

మొగాడేనన్న పిచ్చినమ్మకం, ఎలా ఉండిపోయాయా అని ఎడతెగకుండా ఆలోచించారు. తెగలేదు...ఎంతకీ తెలియలేదు వాడిగుట్టు...మీటింగు వాయిదా వేసి, షూటింగ్ కాన్సెల్‌చేసి, స్పెషల్ డిటెక్టివ్‌లచేత మూడు అహోరాత్రులు పరిశోధన జరిపించారు.

వాళ్లు, నీడలా వాడివెంట పడ్డారు. దురాశలా వాడిలోదూరి కూర్చున్నారు. మూడోనాటికల్లా వాడి గుండెనిబ్బరం గుట్టు కనిపెట్టేశారు. తక్షణం ఇంకో ఎమర్జెన్సీ మీటింగుచేసి ఓరహస్యతీర్మానం చేశారు. మర్నాడే బహిరంగ విచారణ జరిపారన్న మాట. ఇందాక నేచెప్పినట్టు ఆ రైటరుని మధ్య నించోపెట్టి అంతా చుట్టూరానిలబడి వాడి నేరం జాబితా చదివారు.

తరవాత కిరాయి జడ్జి గంభీరంగా నిల్చుని అతనికి అందరూ కలిసి విధించిన శిక్షను పైకి చదివాడు.

అదేమిటని అడగవే? ...అది వినగానే అందరూ హాహాకారాలుచేశారు. ఆరైటరు గోల చెప్పనక్కరేదు.

"ఆశిక్షమటుకు వద్దు...... అది తప్ప ఇంకేదేనా సరే" అని కాళ్లా వేళ్లాపడి మొరపెట్టుకున్నాడు...

'ఏమిటండీ ఆశిక్ష' అన్నాడు రాజు ఉండబట్టలేక.

సుబ్బారావు బాధగా నవ్వి ఒక నిముషం మౌనంపాటించాడు.

"అదా?......మూడు నెలలపాటు ఈ స్టుడియో కాంటీన్‌లో కాఫీ మున్నాటలా పూటకి కప్పు చొప్పున ఈముద్దాయి త్రాగవలెను" అని శిక్ష వేశారు. డిటెక్టివ్‌లు కనిపెట్టిన గుట్టు అదే. ఆరైటరు ఇంటివద్ద దగ్గ్రించి వేరే కాఫీ తెచ్చుకుంటున్నాట్ట. స్టుడియో కాఫీ చుక్కకూడా ముట్టుకోటంలేదుట...అదే ఈ ధైర్యానికి కారణం...ఇంకేముంది వారంరోజులు తాగినేచాలు... నువ్వు ఇక్కడ కాఫీ తాగుతానంటే నాకు ఈ గాథ గుర్తొచ్చింది. కావాలా చెప్పు? ఇంద అన్నాడు సుబ్బారావు.

"అయ్య బాబోయ్...వద్దండి" అన్నాడు రాజు.

సుబ్బారావు జాలిగా నవ్వాడు. అయితే లాభంలేదు బ్రదర్...నువ్వు సినిమాలకిపనికి రావు నీ ధైర్యం, గట్రా దాచుకోవాలంటే' అన్నాడు.

(పైవారం — హీరోయిన్ ప్రవేశం)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad